## ఐదవ ప్రకరణం

# ఇబాదత్ నిర్ధారణలో ఉన్న అపోహలు, అపార్థాలు

ఆరాధనలు దైవం తరఫున నిర్ధారితమైనవి – అంటే ఏ ఆరాధన అయినా దైవగ్రంథానికి, దైవప్రవక్త (ﷺ) విధానానికి విరుద్ధంగా, నిరాధారంగా చేస్తే అది సమ్మతం కాదు. షరీయత్‌లో లేని ఆరాధన స్వీకారయోగ్యమవదు. పైగా అదొక కొత్త పోకడ (బిద్‌అత్)గా పరిగణించబడుతుంది. మహనీయ ముహమ్మద్ (ﷺ) ప్రవచించినట్లు:

"مَنْ عَمِلَ عَمَلاً لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ" (متفق عليه)

**"మేము ఆజ్ఞాపించని పనిని ఎవరయినా చేస్తే అది కొట్టివేయబడుతుంది (త్రోసిపుచ్చబడుతుంది)." (ముత్తఫఖున్ అలై)**

అంటే; అతని ఆచరణ అతనికే త్రిప్పి పంపబడుతుంది – అది స్వీకరించబడదు. పైగా ఆ పనిచేసిన కారణంగా అతను పాపాత్ముడవుతాడు. ఎందుకంటే అతను అవిధేయతకు ఒడిగట్టాడు. విధేయుడుగా రాణించలేదు.

షరీయతు ద్వారా రూఢీ అయిన ఆరాధనలను నెరవేర్చేటప్పుడు మనిషి రెండు అతివాదాలకు నడుమ మధ్యేమార్గాన్ని అవలంబించాలి. ఇదే సరైన విధానం. దేవుడు తన ప్రవక్త (సఅసం) కు ఈ విధంగా ఉపదేశించాడు :

﴿فَاسْتَقِمْ كَمَا أُمِرْتَ وَمَن تَابَ مَعَكَ وَلَا تَطْغَوْا﴾ (هود:١١٢)

**"కనుక (ఓ ముహమ్మద్!) నీకు ఆజ్ఞాపించబడినట్లుగా నీవూ, నీతోపాటు (పశ్చాత్తాపభావంతో) మరలి వచ్చినవారూ గట్టిగా నిలబడి ఉండండి. హద్దు మీరకండి." (హూద్ : 112)**

ఆరాధనలను పాటించే విషయంలో ఈ సూక్తిలో సరైన విధానమేదో, దాని పరిమితులేవో స్పష్టంగా సూచించబడ్డాయి. అంటే హెచ్చుతగ్గులు చేయకుండా, కుడి ఎడమల అపవాదాలకు లోనుకాకుండా మధ్యేమార్గాన్ని అవలంబించాలి. దానిపై నిలకడ చూపాలి. దివ్య వచనంలో సూచించినట్లుగా షరీయత్ కనుగుణంగా ఆరాధన చేయాలి. ఆయత్‌లో ﴿كَمَا أُمِرْتَ﴾ **'ఆజ్ఞాపించబడినట్లుగా'** అనే పదం గమనించదగినది. ఆ తరువాత ﴿وَلَا تَطْغَوْا﴾ **'హద్దు మీరవద్దు'** అని చెప్పటం కూడా గమనార్హమే. తనకు చేయబడిన సూచనను లక్ష్యపెట్టకుండా, నిర్లక్ష్యంగా అవధులు మీరిపోవటాన్ని అరబీలో **'తుగ్‌యాన్'** అంటారు. అంటే ఇక్కడ భావం ఆరాధనలలో అతిశయిల్లటం అన్నమాట!

అలాగే – తన ప్రియ సహచరులలో ముగ్గురు వ్యక్తులు తమ దైనందిన ఆచరణలను తక్కువగా భావించి, అతివాదంతో కూడిన ఒక నిర్ణయానికి వచ్చారని మహాప్రవక్త (ﷺ) కు తెలిసింది. అంటే వారిలో ఒకరు అనుదినం ఉపవాసం ఉంటానని, ఉపవాస విరమణ

చేయనని నిర్ణయించుకోగా, నేను రాత్రంతా నమాజ్‌లో నిలబడతాను, అసలు నిద్రేపోనని రెండోవ్యక్తి సంకల్పించుకున్నాడు. నేనసలు స్త్రీలను వివాహమే చేసుకోనని మూడవ వ్యక్తి నిశ్చయించుకున్నాడు. ఆయన (ﷺ) ఆ ముగ్గురినీ ఉద్దేశ్యించి, "నేను (నఫిల్) ఉపవాసాలూ పాటిస్తాను, మధ్య మధ్యలో ఉపవాస విరమణ కూడా చేస్తుంటాను. నేను రాత్రిపూట జాగరణ కూడా చేస్తాను. నిద్రపోవటం కూడా చేస్తాను. నేను స్త్రీలను వివాహమాడుతాను కూడా. నా విధానం పట్ల విముఖత చూపినవాడు నా వాడు కాడు" అని ఉపదేశించారు. (ముత్తఫకున్ అలై)

నేడు ప్రజలు ఆరాధనల విషయంలో రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒకరు తూర్పున ఉంటే మరొకరు పడమరన ఉన్నారు.

## మొదటి వర్గం :

ఆరాధనల భావార్థాన్ని గ్రహించటంలో వీరివల్ల లోటు జరిగింది. అందువల్ల వీరు దైవారాధన విషయంలో మరీ బద్ధకంగా వ్యవహరిస్తున్నారు. ఆరాధనల క్రిందవచ్చే ఎన్నో విషయాలను వీరు స్తంభింపజేశారు. పైగా వాటిని కొన్ని ప్రత్యేక ఆచారాలకు, చిహ్నాలకు పరిమితం చేసివేశారు. అవి కేవలం మస్జిద్‌లో మాత్రమే ఆచరించబడతాయి. గృహ వ్యవహారాలలో, కార్యాలయాలలో, దుకాణాలలో, వ్యవహారాలలో, రాజకీయాలలో, వివాదాలపై తీర్పు తదితర విషయాలలో ఆరాధనా భావానికి – వీరి దృష్టిలో – ఎలాంటి ప్రమేయమే లేదు.

మస్జిదులకు గల ప్రాశస్త్యాన్ని ఎవరూ కాదనటం లేదు. ఐదు పూటల నమాజులను మస్జిదులలో చేయటం తప్పనిసరే. కాని ఒక ముస్లిం జీవితపు సమస్త విభాగాలను ఆరాధన (ఇబాదత్) పరివేష్ఠించి ఉంది – అతను మస్జిదులో ఉన్నా, మస్జిద్ బయట ఉన్నా వాటి నుండి తప్పించుకోలేడు.

## రెండవ వర్గం :

ఆరాధనలు, ఉపాసనల నిర్వర్తనలో ఈ వర్గం వారి వ్యవహారం అతిశయిల్లి రాగాన పడింది. వీళ్లు అభిలషణీయం (ముస్తహబాత్) అయిన ఎన్నో ఆరాధనలను తప్పనిసరి (వాజిబ్)గా చేసుకున్నారు. అనుమతించబడిన కొన్ని ముబాహ్ వస్తువులను తమ కొరకు నిషిద్ధం (హరామ్) చేసేసుకున్నారు. తమ అభిమతానికి, దృక్పథానికి వ్యతిరేకంగా కనిపించే వారిని మార్గవిహీనులుగా, పాపాత్ములుగా ముద్రవేస్తున్నారు. తమ వెంట రాని వారిని అంటరానివారుగా చూస్తున్నారు. వారి అవగాహనను తప్పుడు అవగాహనగా ఖరారు చేస్తున్నారు. యదార్థానికి మహనీయ ముహమ్మద్ (ﷺ) వారి విధానమే అత్యుత్తమ విధానం. ధర్మంలో జరిగే కొంగ్రొత్త ఆవిష్కరణలు, సరికొత్త పోకడలన్నీ అధ్వాన్నమైనవే. పెడదారి పట్టించేవే.